క్లుప్తంగా

49 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడ్డ బియ్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు .

కంభం : మండలంలోని జంగంగుంట్ల వద్ద 49 బస్తాల రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జంగంగుంట్ల వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా అర్ధవీడు నుంచి యర్రగొండపాలెంకు 49 బస్తాల రేషన్ బియ్యంతో వెళ్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకొని గోడౌన్‌కు తరలించారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు షేక్ ముస్తఫా, డేవిడ్, క్రిష్ణయ్య, రామనారాయణ పాల్గొన్నారు.

ఎన్జీవోస్ సంఘ అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాసశాస్త్రి

మార్కాపురం టౌన్: మార్కాపురం తాలుకా ఎన్జీవోస్ సంఘ అధ్యక్షుడిగా వెలుగొండ ప్రాజెక్టు కార్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ బి.శ్రీనివాసశాస్త్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఎన్జీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో సంఘ అధ్యక్షుడిగా టి.శ్రీనివాస్ నియమితులవగా ఆయన ఒంగోలుకు బదిలీ కావడంతో కమిటీ సభ్యులు శ్రీనివాసశాస్త్రిని తాజాగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శాస్త్రిని సంఘ సెక్రటరీ వి.శ్రీనివాస్, రెవెన్యూ అసోసియేషన్ డివిజన్ సెక్రటరీ ఎస్.చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగేంద్రరెడ్డి, కోశాధికారి రవికిరణ్ తదితరులు అభినందించి ఘనంగా సన్మానించారు.

ప్రతి పైసాకు పుస్తక నిర్వహణ ఉండాలి

దొనకొండ: సీసీలు, వీఓఏలు తప్పకుండా గ్రామ సంఘాల సమావేశంలో, గ్రూపు సమావేశంలో మహిళలందరికీ అవగాహన కల్పించాలని, ప్రతి పైసాకు పుస్తక నిర్వహణ ఉండాలని ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో బుధవారం 2వ రోజు ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ పాలసీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసుంధరాదేవి మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘం తప్పకుండా ఆర్థిక అంశాలపై అకౌంటింట్ విధానం కలిగి ఉండాలన్నారు. సమావేశంలో ఏపీఎం జి.వెంకటేశ్వర్లు, మండల సమైక్య అధ్యక్షురాలు ఈ.గాలెమ్మ, కోశాధికారి మార్తమ్మ, సీసీలు కోటేశ్వరరావు, పాపారావు, రత్నకుమారి, ప్రసన్న, వీఓఏలు పాల్గొన్నారు.

అటవీ భూములకూ వ్యవసాయ పథకాలు

తాళ్లూరు (ముండ్లమూరు): ఆదివాసీల అభివృద్ధిలో భాగంగా వారు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు సైతం అన్ని రకాల వ్యవసాయ పథకాలు వర్తింపజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బీ ప్రసాదరావు తెలిపారు. మండలంలోని ఏకలవ్యనగర్‌లో బుధవారం ఆదివాసీ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకలవ్యనగర్‌లో 73 మంది రైతులు 254 ఎకరాల భూమి సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈకేవైసీ చేసి రైతు భరోసా, పంటల బీమా, డ్రిప్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ సుమ, రైతులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు సేవలు మరువలేనివి

గిద్దలూరు రూరల్: ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు సేవలు మరువలేనివని నంద్యాల ఆర్పీఎఫ్ సీఐ భాస్కర్ అన్నారు. గిద్దలూరు ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తు శ్రీనివాసరావు బదిలీపై గుంతకల్‌కు వెళుతున్న సందర్భంగా రైల్వేక్వార్టర్స్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీనివాసరావు సేవల గురించి పలువురు రైల్వే అధికారులు కొనియాడారు. స్టేషన్ మాస్టర్ నాయబ్‌రసూల్, ఏఎస్సైలు జయరామయ్య, నాగభూషణం, కానిస్టేబుల్స్ శేషయ్య, నాయబ్‌రసూల్, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో కండ్లకలకతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు బేస్తవారిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కండ్లకలక సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై, నివారణపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఎంఎస్ శర్మ, సీహెచ్‌ఓ హబీబ్‌ఖాన్, వైద్య సిబ్బంది ప్రతిమ, మాధవి, అబ్దుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హత ఉన్న ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తారని సార్డ్స్ సంస్థ ప్రతినిధి మహాలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని నరజాముల తండాలోని ఎస్సీ పాలెం పాఠశాలలో సార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో విద్యార్థులచే ప్లకార్డులు చేపట్టి ప్రభుత్వ విద్యపై నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'నా భూమి నా దేశం'



గనివానిపాడులో మట్టి ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజలు

కొనకనమిట్ల: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న నా భూమి–నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం అన్ని గ్రామాల్లో విజయవంతం చేయడానికి చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. బుధవారం గనివానిపాడు గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో దేశభక్తిని ప్రేరేపించేందుకు, వారిని ఉత్తేజ పరిచేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు గ్రామాల్లో మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. నేలతల్లికి పూజలు నిర్వహించి, ప్రజలతో మట్టిపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు, ఏపీఓ బుల్లెన్న, ఈసీ శ్రీనివాసరెడ్డి, కోఆర్డినేటర్ పాపారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొమరోలు: మండలంలోని ఇడమకల్లులో మేరీ మాకీ మేరీదేశీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎంపీడీఓ డి.నరసయ్య అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ నరసయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో మేరీమాకీ మేరీదేశీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 75 మొక్కలను ప్రతి గ్రామపంచాయతీలో నాటి ఓ శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో పవిత్రమైన స్థలం నుంచి మట్టిని సేకరించి ఓ కలశంలో మండల కేంద్రానికి తరలించాలని సూచించారు.

విద్యుత్ చౌర్యంపై విస్తృత తనిఖీలు

- 23 మందికి రూ.1.27 లక్షల అపరాధ రుసుం



వివరాలు వెల్లడిస్తున్న ఈఈ శ్రీనివాసరావు

కురిచేడు: విద్యుత్ చౌర్యం చేయడం తీవ్ర నేరమని విద్యుత్ విజిలెన్స్ ఈఈ టీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో బుధవారం విజిలెన్స్ ఈఈ టీ శ్రీనివాసరావు, ఆపరేషన్ ఈఈ ఎస్ఏ కరీం నేతృత్వంలో 39 మంది అధికారులు, 85 మంది సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అదనపు లోడు వాడుతున్న 10 మందికి రూ.50 వేల అపరాధరుసుం విధించారు. అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరి కింద వాడుతున్న ఒక్కరికి రూ.5 వేల జరిమానా, మీటరు ఉండి విద్యుత్ చౌర్యం చేస్తున్న ఏడుగురికి రూ.51 వేల జరిమానా, మీటరు లేకుండా విద్యుత్ వాడుతున్న ఐదుగురికి రూ.21 వేల జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యం చేసిన వారికి తొలిసారి మొదటి తప్పిదంగా భావించి కాంపౌండ్ పద్ధతిలో అపరాధ రుసుం విధిస్తామని, రెండోసారి పాల్పడితే కేసులు నమోదు చేసి అరెస్టు చేయిస్తామని ఈఈ శ్రీనివాసరావు హెచ్చరించారు. విద్యుత్ చౌర్యంపై వాట్సాప్ ద్వారాగానీ లేదా నేరుగాగానీ 8331019980 నంబర్‌కు ఫోన్‌చేసి తెలియజేయవచ్చన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కే పిచ్చయ్య, డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఏఈలు, ఎల్ఐలు, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథాశ్రమాన్ని ప్రారంభించిన ట్రైనీ ఎస్పీ



అనాథాశ్రమాన్ని ప్రారంభిస్తున్న ట్రైనీ ఎస్పీ అంకిత సురానా

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామం వద్ద ఫ్లయ్‌ఓవర్ సమీపంలో జోషఫ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాపీ అనాథాశ్రమాన్ని బుధవారం ట్రైనీ ఎస్పీ అంకిత సురానా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సదుద్దేశంతో ఆశ్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనాథ పిల్లలను, తల్లిదండ్రులు లేని పిల్లలను అనాథాశ్రమంలో చేర్పించవచ్చన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్, ఆశ్రమ నిర్వాహకులు బూదాల ప్రదీప్, బుదాల సురేష్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకుడు సుదర్శన్, ఎమ్మార్పీఎస్ నాయకుడు ప్రకాష్, దళిత బహుజన సేవ రాష్ట్ర అధ్యక్షుడు ఎనిబెర కిషోర్, సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

మార్కాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ పోరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహులు తెలిపారు. అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలని, ఎంపీటీసీలు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

దర్శి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నేటి నుంచి ఈ నెల 15వ తేదీ వరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కుసుమకుమారి తెలిపారు. 9వ తేదీ శామంతపూడి, యర్రఓబనపల్లి, తుమ్మెదలపాడు, చందలూరు, పోతవరంలో, 10వ తేదీ తూర్పువీరాయపాలెం, టీఎస్ పురం, బండి వెలిగండ్ల, కొత్తపల్లి, పాపిరెడ్డిపాలెం, దేవవరం, వెంకటాచలంపల్లి, 11న జముకుల దిన్నె, పెద్ద ఉయ్యాలవాడ, తూర్పు వెంకటాపురం, బొట్లపాలెం, బసిరెడ్డిపల్లి, లంకోజనపల్లి, 14న పాతకమూరు, రాజంపల్లి, మారెడ్డిపల్లి, కొర్లమడుగు, తూర్పుచౌటపాలెం, తానంచింతల, రామచంద్రాపురం గ్రామాల్లో వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం హిరోషిమా, నాగసాకిల దినోత్సవం సందర్భంగా క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొని క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

కురిచేడు: మండలంలోని పడమరవీరాయపాలెం గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన వారికి బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాల హెచ్‌ఎం పచ్చా పూర్ణచంద్రరావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి వారిని సన్మానించారు. సమావేశానికి మండల విద్యాశాఖాధికారులు ఇద్దరు, ఎంపీటీసీ తాళ్లూరి నాసరమ్మ, విద్యాకమిటీ చైర్మన్ మేకల లక్ష్మీకుమారి ముఖ్య అతిథులుగా హాజరై బదిలీ అయిన ఉపాధ్యాయులు ఇట్లా వెంకటేశ్వర్లు, రామ సుబ్బారావు, ఎస్.సంధ్యారాణి, కే ఆదెమ్మతో పాటు మండల విద్యాశాఖ అధికారులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సీహెచ్ సుబ్బారావు, వైఆర్ జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు జీ నాగేశ్వరరావు, గ్రామ రిటైర్డ్ వీఆర్వో ఊట్ల పోలయ్య, ఎమ్మార్సీ షేక్ మహబూబ్‌బాషా, యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు షేక్ ఖాదర్‌వలి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొదుపు గ్రూపులకు వడ్డీతో సహా చెల్లింపులు

యర్రగొండపాలెం: స్వయం సహాయక సంఘాలకు బీసీ పాయింట్ నుంచి వడ్డీతో సహా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి బుధవారం తెలిపారు. త్రిపురాంతకం మండలంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు బీసీ పాయింట్‌లో జరిగిన అవకతవకలపై మూడు రోజులుగా విచారణ సాగుతోంది. యర్రగొండపాలెం మండలంలోని నరసాయపాలెం, గంగపాలెం గ్రామాలకు చెందిన స్వయం సహాయక సంఘాలు నరసాయపాలెంలో ఉన్న ఆ బ్యాంకు బీసీ పాయింట్‌లో లావాదేవీలు జరుపుతున్నారు. ఈ క్రమంలో బీసీ పాయింట్ నిర్వాహకుడు గుంటక వెంకటరెడ్డి లావాదేవీలకు సంబంధించిన రూ.3,82,900 బ్యాంకుకు జమ చేయలేదు. ఈ డబ్బును వడ్డీతో సహా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

డ్రాగన్ పండ్లతో ఆరోగ్యం

తాళ్లూరు (ముండ్లమూరు): డ్రాగన్ పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయని జిల్లా ఉద్యానవన శాఖాధికారి వై.గోపీచంద్ అన్నారు. మండలంలోని మాధవరంలో రామిరెడ్డి సాగుచేసిన డ్రాగన్ పంటను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే నూతన వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. డ్రాగన్ తోటను ఆరోగ్యవంతంగా నిర్వహించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఒకసారి తోటను నాటితే 25 ఏళ్ల వరకు ఫలసాయం వస్తుందన్నారు. ప్రారంభంలో మొదటి ఏడాది మాత్రమే నిర్వహణ ఖర్చు ఎక్కువగా ఉంటుందన్నారు. చాలా ఔషధ లక్షణాలున్న డ్రాగన్ పంట సాగు వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు.

మిరప రైతులకు అవగాహన అవసరం

కురిచేడు: మండలంలోని మిరప రైతులకు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో దర్శి కేవీకే కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.జాహ్నవి అవగాహన కల్పించారు. మిరప నర్సరీ నారులో తామర పురుగు, తెల్లదోమను గమనించడం జరిగిందని, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. నల్ల తామర అక్టోబర్ నుంచి డిసెంబరు వరకు వస్తుందని, దాని నివారణకు మొదట వేపనూనె సంబంధ మందులు, తర్వాత జిగురు అట్టలు, ఆ తర్వాత బయోఫంగిసైట్స్ వాడి రసంపీల్చే పురుగుల ఉధృతిని నిర్మూలించాలన్నారు. పొలం చుట్టూ జొన్న లేదా మొక్కజొన్న మొక్కలు రెండు సాళ్లు వేసుకోవడం ద్వారా పక్కపొలాల నుంచి వచ్చే రసం పీల్చే పురుగులు నివారించవచ్చన్నారు. అనంతరం మిరపనారుమడిని పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి డి.సంధ్య, మండల వ్యవసాయాధికారి పీ మధుబాబు, వ్యవసాయ సహాయకులు, మండల మిరప రైతులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో మొక్కల పంపిణీ

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం మొక్కలు పంపిణీ చేశారు. ముందుగా పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హనుమంతరావు, ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, ఏపీఓ కొండయ్య, పీఈటీ రాముడు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవోదయ దరఖాస్తు గడుపు పెంపు

తర్లుపాడు: కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయ–2లో 2024–25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈనెల 17 వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ బుధవారం తెలిపారు. దరఖాస్తుదారులు పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. 4, 5వ తరగతులు వరుసగా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో కచ్చితంగా చదివి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు నవోదయ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌ను సందర్శించవచ్చన్నారు

36 మంది గర్భిణులకు పరీక్షలు

దర్శి: మండలంలోని చందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ ప్రోగ్రాం కింద బుధవారం వైద్యాధికారి శ్రీనివాసులు 36 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. వారికి 15 రకాలైన రక్తపరీక్షలు, సుగర్, బరువు, ఎత్తు, హిమోగ్లోబిన్, బ్లడ్‌గ్రూప్, మూత్ర పరీక్ష, ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ తదితర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ దయమని, ల్యాబ్‌టెక్నీషియన్ వసంతకుమార్, స్టాఫ్‌నర్స్ ఉషారాణి, వాణి, సుభాషిణి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పొదిలిలో యువకుల బాహాబాహీ

- నలుగురికి గాయాలు
- పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు

పొదిలి: స్థానిక మార్కాపురం అడ్డరోడ్డు వద్ద రెండు గ్రామాలకు చెందిన యువకులు బాహాబాహీకి దిగారు. ఈ ఘర్షణలో నలుగురు యువకులకు గాయాలు కాగా.. పరస్పర ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాలు.. పాములపాడు గ్రామానికి చెందిన పల్లెపోగు దేవప్రసాద్ తన అమ్మమ్మ ఊరైన పోతవరం గ్రామానికి కొంత కాలం క్రితం వచ్చాడు. పోతవరం గ్రామానికి చెందిన శ్యామ్యూల్‌తో మనం కలిసి క్రికెట్ ఆడుకుందామని మాట్లాడుకున్నారు. ఈ విషయంలో మంగళవారం రాత్రి రెండు వర్గాల యువకుల మధ్య మాటామాటా పెరిగి కొట్లాటకు దారి తీసింది. పోలీసులకు సమాచారం అందడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని యువకులను చెదరగొట్టారు. పోతవరానికి చెందిన జి.శ్యామ్యూల్, జి.పెద్దబాబు, పాములపాడుకు చెందిన జి.దేవప్రసాద్, బి.ఏలియాకు గాయ్యాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు. శ్యామ్యూల్, దేవప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని, వారి కుటుంబ సభ్యులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చామని చెప్పారు.

ఆదివాసీలకు మెరుగైన వసతులు కల్పించాలి

ముండ్లమూరు: ఆదివాసీలకు మెరుగైన వసతులు కల్పించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అన్నారు. బుధవారం అంతర్జాతీయ ఆదివాసీ హక్కుల దినోత్సవం సందర్భంగా ముండ్లమూరు ఎస్టీకాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదివాసీల హక్కుల కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఆదివాసీలకు ప్రధాన వనరులైన ఇంటి స్థలం, తాగునీరు సక్రమంగా అందకపోవడం దురదృష్టకరమన్నారు. నివాసయోగ్యమైన ఇళ్లు లేకపోవడంతో విద్య, వైద్యం కల్పించి వారి జీవన విధానాలు మెరుగుకు పాలకులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యానాది సేవా సంఘ కార్యదర్శి మేకల ఆదినారాయణ, డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ గోపనబోయిన వెంకట్రావు, మండల యానాది సేవా సంఘ నాయకులు కొమరగిరి బుల్లియ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.